విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 17, మే 2025

ఫారం భూములను సోలార్‌కు కేటాయిస్తే

ఉద్యమిస్తాం

- తంగడంచ ఫారం భూములను అన్యాక్రాంతం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదు
- భూముల అభివృద్ధి చేతకాకపోతే పేదలకు పంచండి
- మెగా సీడ్ పార్కు అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి సీపీఐ హెచ్చరిక

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : జూపాడు బంగ్లా మండలం తంగడంచ రాష్ట్ర వితనోత్పత్తి క్షేత్రం పరిధిలో ఉన్న 1600 ఎకరాల ప్రభుత్వ భూములు అభివృద్ధి చేయాలని, అభివృద్ధి చేయకుండా విభజిస్తూ అన్యాక్రాంతం చేయాలని చూస్తే సీపీఐ చూస్తూ ఊరు కోదని అభివృద్ధి చేతకాకపోతే భూమిలేని పేదలకు పంచాలని, రాబోయే రోజుల్లో కేంద్రీయ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ భూముల్లో కేటాయింపుకు చేసేందుకు ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం సీపీఐ జిల్లా కార్యదర్శిఎన్ రంగనాయుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రఘురాంమూర్తి, సిపిఐ జిల్లా నాయకులు రమేష్ బాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్నలు మండలంలోని తంగడంచ ఏపీఐఐసీ భూములను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే అత్యంత నాణ్యమైన వంగడాలు ఉత్పత్తి చేసే నల్లరేగడి భూములను అభివృద్ధి పేరుతో విచ్ఛిన్నం చేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని వారు అన్నారు. నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరిలు ఈ ప్రాంత వాసులు ఈ భూముల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించాలని ఫారం భూముల అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని వారు అన్నారు. కేంద్రీయ వ్యవసాయ విశ్వవిద్యాలయంతో పాటుగా వ్యవసాయ అభివృద్ధి విత్తనాలు తయారు చేసే వాటికి భూములు ఉపయోగించాలన్నారు. గత పది సంవత్సరాల నుండి ఈ భూములను పట్టించుకోకపోవడం వల్ల అడవిని తలపిస్తున్నాయన్నారు. మెట్ట ప్రాంతాల్లో పెట్టాల్సిన సోలార్‌ను నల్లరేగడి పొలాల్లో ఎలా పెట్టాలని ఆలోచిస్తారని వారు అన్నారు. తక్షణమే ఆర్డిఓ నాగజోతి సోలార్ భూముల కేటాయింపు ఆలోచన మార్చుకోవాలని వారు అన్నారు. 1600 ఎకరాల ప్రభుత్వ భూములను నమ్ముకుని దాదాపు 12గ్రామాల ప్రజలు, యువత ఎప్పుడో ఒకసారి ఉపాధి దొరుకు తుందని ఈ ప్రాంతం వారు ఆలోచిస్తూ జీవిస్తున్నారని అలాంటి వారి నోట్లో మట్టి కొట్టాలని చూస్తే ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమ వుతామన్నారు. అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేస్తే మండలంలోని భూమిలేని నిరుపేదలకు భూముల పంపిణీకి శ్రీకారం చుడతామని వారు హెచ్చరించారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న పరిస్థితుల్లో మూడుసార్లు శంకుస్థాపనలు చేశారని 75శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇచ్చి పరిశ్రమ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. అయితే ఆ హామీ గత ఐదు సంవత్సరాల పాలనలో అమలు కాలేదు అన్నారు. తక్షణమే ఇప్పుడైనా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ భూములపై దృష్టి కేంద్రీకరించి అభివృద్ధి చేసి యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. రాబోయే రోజుల్లో సీపీఐ ఆధ్వర్యంలో ఈ భూముల పరిరక్షణకు అభివృద్ధికి ఉపాధి కల్పనకు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సిపిఐ నందికొట్కూరు పట్టణ కార్యదర్శి ఎం శ్రీనివాసులు, కొత్తపల్లి మండల కార్యదర్శి వెంకట శివుడు, జూపాడు బంగ్లా మండల నాయకులు శీను, శ్రీరాములు తంగడంచ శాఖ కార్యదర్శి దివాకర్, వలి, ఏఐఎస్ఎఫ్ తాలూకా నాయకులు దినేష్ తదితరులు పాల్గొన్నారు.

మూతపడ్డ కేసీ కెనాల్ తూము తెరిపించాలి

విశాలాంధ్ర - నందికొట్కూరు : నియోజవర్గ పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామంలో కేసి కెనాల్ అభివృద్ధి పనులలో మూతపడ్డా 7ఆర్ తూమును తెరిపించి రైతులకు సాగునీరు అందించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పగిడాల మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజవర్గ శాసనసభ్యులు గిత్త జయసూర్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రాతకోట గ్రామంలోని కేసి కెనాల్ ప్రక్కన నాన్ ఆయకట్టు పొలం 347 ఎకరాలు వుందని ఆ పోలానికి 7ఆర్ తూము ద్వారా సాగునీరు అందుతుండేదని తెలిపారు. 2004 సం.లో కేసి కెనాల్ అభివృద్ధి పనులలో భాగంగా ఆ తూమును అధికారులు మూసి వేయటం వల్ల రైతులకు సాగు నీరు ప్రస్తుతం అందడం లేదన్నారు. వేసుకున్న పంటకు సరైన దిగుబడి లేక రైతులు నష్టపోతున్నారనీ, ఎక్కువ శాతం పేద రైతులకు చెందిన పోలాలు వున్నాయన్నారు. రైతులను దృష్టిలో వుంచుకోని 7ఆర్ తూము ద్వారా రైతులకుసాగు నీరు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతులు నాగేశ్వరరావు,ఆశోక్, శేషులు తదితరులు ఉన్నారు.

ఏసీబీ దాడుల్లో పట్టుబడ్డ ఏడీఈ

రవికాంత చౌదరి (ఫైల్ ఫోటో)

విశాలాంధ్ర - రుద్రవరం : మండల పరిధిలోని చిన్న కంబలూరు మెట్ట దగ్గర వద్ద ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏసీబీ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బిల్లు ఆపరేటర్ ప్రతాప్ పట్టుపడ్డారు. ఏసీబీ డిఎస్పి సోమన్న తెలిపిన వివరాల మేరకు చిన్న కంబలూరు గ్రామానికి చెందిన రామకృష్ణాచారి, లింగమూర్తి అనే రైతులు గత సంవత్సర క్రితం తమకున్న 2,50 ఎకరాల భూమిలో విద్యుత్తు స్తంభాలు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసుకోవడానికి విద్యుత్తు ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆ దరఖాస్తును పరిశీలించిన అధికారులు సంబంధిత రైతులకు ట్రాన్స్ఫార్మర్, నాలుగు విద్యుత్తు స్తంభాల మంజూరు కోసం దరఖాస్తులను పరిశీలించి రైతులకు మంజూరు చేయాలని ఉన్నత అధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. దీంతో రైతులు ఏడిఈ రవికాంత చౌదరిని కలిసి తమకు తొందరగా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ స్తంభాల ఏర్పాటుకు మంజూరు చేయాలని కోరారు అన్నారు. దీంతో ఆయన మంజూరు చేయాలంటే రూ.50 వేలు ఇవ్వాలని రైతులను డిమాండ్ చేశారన్నారు. దీంతో రైతులు అంతా ఇవ్వలేమని రూ.20 వేలు ఇస్తామని చెప్పడంతో ఆయన ఒప్పుకోలేదని చివరకు రూ30 వేలు ఇస్తేనే ట్రాన్స్ఫార్మర్ స్తంభాలు ఇస్తామని చెప్పడంతో రైతులు ఎడిఈ దగ్గర ఒప్పందం కుదుర్చుకొని కర్నూల్‌లోని అవినీతి నిరోధక శాఖ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో వారికి రూ 30 వేల రూపాయలు రంగు పూసిన నోట్లను ఇవ్వడం జరిగిందన్నారు. వీటిని తీసుకొని రైతులు ఏడిఈ రవికాంత చౌదరికి ఇవ్వాలని ఫోన్ చేయగా ఆయన చిన్న కంబ లూరు గ్రామంలో పనిచేస్తున్న బిల్ ఆపరేటర్ ప్రతాప్ కు 30, వేలు ఇవ్వాలని చెప్పడంతో అతనికి ఈ మొత్తాన్ని ఇచ్చారన్నారు. వెంటనే దాడి చేసి అతన్ని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టామన్నారు. అలాగే ఏడీ ఈ రవికాంత చౌదరిని కూడా అదుపు లోకి తీసుకొని విచారణ చేపట్టామన్నారు. ఇరువుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డిఎస్పి సోమన్న తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ,సీఐ కృష్ణయ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధిలో టీజీ కీలకం

విశాలాంధ్ర - బనగానపల్లె : ఆర్యవైశ్యుల అభివృద్ధిలో మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ ఎంతో కీలకమని విద్య వైద్య వ్యాపార రంగాలలోనే కాకుండా రాజకీయ రంగాలలో కూడా ఆర్యవైశ్యులు అభివృద్ధి చెందాలని ముందుకు రావాలని ఆకాంక్షించిన గొప్ప వ్యక్తి అని టీజీ వెంకటేష్ సేవలను ప్రపంచార్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు, బనగానపల్లె నియోజకవర్గం ఆర్యవైశ్య ప్రముఖులు టంగుటూరి శీనయ్య పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని అమ్మవారి శాల నందు శ్రీ కన్యకా పరమేశ్వరి మాత అమ్మవారి ఆలయంలో టీజీ వెంకటేష్ జన్మదిన సందర్భంగా ప్రపంచార్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగాల నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులందరూ కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీజీ వెంకటేష్ ఆయురారోగ్యంగా అష్టైశ్వర్యాలతో జీవితం కొనసాగాలని అమ్మవారిని శీనయ్య కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల మహిళా జిల్లా అధ్యక్షురాలు బండారు లలిత, ఆదావేణి లక్ష్మి, భరతుడు, బండారు ప్రకాష్, ఎస్ఎస్ఎం, బింగిమల్ల సుబ్రమణ్యం, నూకల విజయుడు, నల్లగట్ల వెంకటేశ్వర్లు, పిఎస్ఎస్ నారాయణ, నూకల మధు, కాఫీ పొడి శివ, నూకల శీను, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలి

విశాలాంధ్ర - వెలుగోడు: పట్టణంలోని ఎస్‌డిపిఐ కార్యాలయం నందు శుక్రవారం శ్రీశైలం నియోజకవర్గం అసెంబ్లీ కార్యదర్శి తౌసీఫ్ అధ్యక్షతన బ్రాంచ్ ప్రెసిడెంట్, సెక్రటరీలతో కలిసి అసెంబ్లీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి అమీర్ ఉపాధ్యక్షులు కలాం, జిల్లా కమిటీ మెంబర్ మహబూబ్ బాషా హాజరయ్యారు. ఈ సమావేశంలో ముఖ్యంగా పార్టీ బలోపేతం కోసం చర్చించారు.

ముగిసిన రాతిదూలం పోటీలు

విశాలాంధ్ర-అవుకు : శ్రీ భూలక్ష్మి సమేత చెన్నకేశవ స్వామి తిరుకళ్యాణ మహోత్సవాలలో భాగంగా శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన ఒంగోలు జాతి సీనియర్ వృషభరాజముల రాతిదూలం పోటీలను మండల టీడీపీ అధ్యక్షుడు ఉగ్రసేనారెడ్డి, టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుగాలి వెంకటరమణ నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ రాతి దూలం పోటీలలో ఏడు జతల వృషభరాజములు పాల్గొనగా ధర్మవరం సుబ్బారెడ్డికి సంబంధించిన వృషభరాజములు మొదటి స్థానంలో నిలిచి లక్ష రూపాయల బహుమతిని గెలుపొందాయి. రెండవ బహుమతి రూ.80 వేలు రామాంజనేయులు వృషభరాజములకు బహుమతులను అందజేశారు. ఈ వృషభరాజముల రాతిదూలం పోటీలను తిలకించేందుకు అవుకు పట్టణంలోని రైతులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. గెలుపొందిన వృషభ రాజుల యజమానులకు ఉగ్రసేనారెడ్డి బహుమతులను అందించారు. రాత్రి దూలం పోటీలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బనగానపల్లె సిఐ మంజునాథరెడ్డి ఆధ్వర్యంలో అవుకు ఎస్ఐ రాజారెడ్డి గట్టి పోలీసు పొందబోతున్న ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిసిసి డైరెక్టర్ అరుణ్ కుమార్ నాయక్, బత్తిని మద్దిలేటి గౌడ్, దంతల రమణ, తిక్కన్న, రైతు సంఘం పెద్దలు పాల్గొన్నారు.

ముమ్మరంగా కాలుష్య నివారణ చర్యలు

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల కేంద్రంలోని శిరివెళ్ల ప్రధాన రహదారి పెద్దమ్మ మోరి నుండి రుద్రవరం వైపు వెళ్లే రహదారికి ఇరువైపులా మరియు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లే దారి అంతర్గత సీసీ రోడ్లకు ఇరువైపులా ఉన్నటువంటి డ్రైనేజీ కాలువల్లో కాలుష్య నివారణ చర్యలు చేపట్టినట్లు ఇఓ అశ్వని కుమార్ శుక్రవారం తెలిపారు. డ్రైనేజీ కాలువల శుభ్రత పై ప్రత్యేక ద్రుష్టి పెట్టి మురికీ నీటిని చెత్త చెదారాన్ని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమల ఉత్పత్తి నియంత్రణకు పారిశుద్ధ్య రసాయనిక మందులు స్ప్రే చేసినట్లు పేర్కొన్నారు. వెంకటేశ్వరపురం వెళ్లే రాస్తా ప్రక్కన ఉన్న స్మాల్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద పేరుకుపోయిన మురికి నీటిని చెత్తాచెదారాన్ని డ్రైనేజీ నీటిని తొలగించి క్లోరినేషన్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత శుభ్రత ఆరోగ్య భద్రత గురించి ప్రతి ఒక్క కుటుంబం అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇంటి పగిసరాలని ఇంటి సమీపంలోని వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ ఇఓ అశ్వని కుమార్ తెలిపారు.

స్పీకర్ అయ్యన్నపాత్రుడుని సన్మానించిన మంత్రి

విశాలాంధ్ర- బనగానపల్లె : నంద్యాల జిల్లా పర్యటనలో భాగంగా బనగానపల్లె పట్టణంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నివాసానికి విచ్చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడుని బనగానపల్లె ఎమ్మెల్యే, రోడ్లు భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాలు శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, బీసీ ఇందిరా రెడ్డి దంపతులు ఘన స్వాగతం పలికి శాలువతో సన్మానించి వెంకటేశ్వర స్వామి ప్రతిమను బహూకరించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సహచర మంత్రి ఫరూక్‌తో కలిసి జిల్లాకు సంబంధించిన పలు అంశాల అభివృద్ధి గురించి చర్చించారు. మంత్రి బీసీ నివాసానికి స్పీకర్ రావడంతో నియోజవర్గానికి చెందిన టిడిపి నాయకులు పాల్గొని బొకేలు అందజేశారు. నంద్యాల జిల్లా టిడిపి వాణిజ్య విభాగ్య చైర్మన్ టంగుటూరి సీనయ్య, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్,పట్టణ అధ్యక్షుడు కాసింబాబు, ముస్లిం మైనార్టీ నియోజవర్గం అధ్యక్షుడు రాయలసీమ సలాం, యాగంటి పల్లె ఉపసర్పంచ్ బండి మౌలీశ్వర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, మద్దిలేటి రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ దివాకర్ రెడ్డి,టిఎస్ఆర్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, నాగేంద్ర రెడ్డి, అల్తాఫ్, రమణ టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగస్వాములను చేయండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఈనెల 17వ తేదీ మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ఈ మాసం "బీట్ ది హీట్" (వేడి ప్రభావాలను తగ్గించే అంశంపై) కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మండల స్పెషల్ అధికారులు, ఎంపీడీఓలు, తహశీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ నుండి స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమ పటిష్ట అమలుపై జిల్లాధికారులు, సంబంధిత మండల అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా "బీట్ దిహీట్" (వేడి ప్రభావాలను తగ్గించే అంశంపై) కార్యక్రమంలో అందరూ భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జనవరి నుండి ఇప్పటి వరకు నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలను, థీమ్‌లో పేర్కొన్న అంశాలను ప్రతి కార్యాలయంలో గోడకు ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జనవరి మాసంలో నూతన సంవత్సర క్లీన్ స్టార్ట్, ఫిబ్రవరిలో సోర్స్- రిసోర్స్, మార్చిలో "సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం -పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించడం", ఏప్రిల్‌లో ఈ-చెక్ కార్యక్రమాల ద్వారా పరిశుభ్రత చర్యలు చేపట్టామన్నారు.మే మాసంలో బీట్ ది హీట్ (వేడి ప్రభావాలను తగ్గించే అంశంపై) కార్యక్రమంలో అందరూ భాగస్వాములై ప్రభుత్వం జారీ చేసిన ప్రతిజ్ఞను ప్రజలందరి చేత చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేడి ప్రభావాలను తగ్గించడానికి ట్రాఫిక్ కూడళ్లు, మార్కెట్‌లు, బస్ స్టాప్‌లు, మతపరమైన ప్రదేశాలు, ఇతర పబ్లిక్ కాంగ్రిగేషన్ పాయింట్‌ల వద్ద షేడెడ్ నెట్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. భవనం వేడిని తగ్గించడానికి, జీవవైవిధ్యాన్ని ప్రోత్సహించడానికి రూఫ్‌టాప్ గార్డెనింగ్, ప్లాంటేషన్ కార్యక్రమాలను ప్రోత్సహించాలన్నారు. ఇండోర్ ఉష్ణోగ్రతలను తగ్గించడానికి ప్రభుత్వ కార్యాలయాలు, గృహాల పైకప్పులపై సోలార్- రిఫ్లెక్టివ్ వైట్ పెయింట్‌లు వేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. నీటి సంరక్షణ కోసం పాఠశాలలు, కార్యాలయాలు, ప్రభుత్వ భవనాలలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్ల వెంబడి, పాఠశాల ప్రాంగణాలు, ఉద్యానవనాలు, బహిరంగ ప్రదేశాలలో చెట్ల పెంపకం డ్రైవ్‌లను నిర్వహించాలన్నారు. సీనియర్ సిటిజన్లు, పిల్లలు, బహిరంగ కార్మికుల కోసం ఆరోగ్య శిబిరాలు నిర్వహించి, హీట్ స్ట్రోక్‌ల నివారణ, ప్రథమ చికిత్సలపై అవగాహన కల్పించాలన్నారు. జంక్షన్లు, ఉద్యానవనాలు, ఆలయ పరిసరాలలో పక్షులు మరియు విచ్చలవిడి జంతువుల కోసం నీటితో నింపిన మట్టి గిన్నెలను ఏర్పాటు చేయాలన్నారు. వేడిని తగ్గించడం, పారిశుధ్యం, ప్రజా సంక్షేమంలో నిమగ్నమై ఉన్న ఫ్రంట్‌లైన్ కార్మికులు, వాలంటీర్లు, ఎన్జిఓలు అందించిన సహకారాలను గుర్తించి బహుమతులను అందజేయాలన్నారు.

సాదాసీదాగా

సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - చాగలమర్రి : చాగలమర్రి మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ వీరభద్రుడు అధ్యక్షతన, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం సాదాసీదాగా ముగిసింది. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజర య్యారు. సమావేశానికి ముందుగా పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి, యుద్దంలో వీరమరణం పొందిన జవాన్ మురళి నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివా ళులు అర్పించారు. అనంతరం మండల స్థాయిలో గ్రామాల అభివృద్ధి, జరిగిన పనులపై ఎలాంటి చర్చలు లేకుండా సాదాసీదా వారి శాఖలలో జరిగిన పురోగతిని వివరించి మమా అనిపించారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీలు రఫి,ఆశీ ర్వాదమ్మ, తహసీల్దార్ రవికుమార్, ఎంఈఓ న్యాంతుల్లా, పశువైద్యాధికారులు సాయిబాబా, దీపాకుమారి, ఏఓ రంగనే తాజీ, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, రమణయ్య, నరసింహా రావు, ప్రకృతి వ్యవసాయ డివిజన్ ఇన్‌చార్జ్ నాగేశ్వరరెడ్డి, ఏపిఓ ఖాసీం, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుశీల,వివిధ శాఖల అధికారులు, ఎంపిటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన క్రియాశీలక సభ్యత్వం కిట్లను జనసేన పార్టీ ప్రెసిడెంట్ సెక్రటరీ సభ్యుల సమక్షంలో నంద్యాల జనసేన సమన్వయకర్త పిడతల సుధాకర్, సుధామోహన్ రెడ్డి, రాష్ట్ర రాంచరణ్ యువత అధ్యక్షులు పబ్బతి రవి ఆధ్వర్యంలో శుక్రవారం సభ్యత్వం చేసుకున్న వారికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన పార్టీ కార్యకర్తలకు, వీర మహిళలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ఏదైనా ప్రమాదం జరిగి గాయపడినా, ప్రమాదం జరిగి చనిపోయినా ఇన్సూరెన్స్ వస్తుందని తెలిపారు. 2017వ సంవత్సరంలో నంద్యాలకు చెందిన జన సైనికుడు ప్రమాదంలో మరణిస్తే జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో రూ.5లక్షల చెక్కును అందించామన్నారు. ప్రమాదంలో గాయపడిన జనసేన కార్యకర్తలకు రూ.50 వేలు హస్పటల్ ఖర్చులకు చెక్కులను అందజేశామన్నారు. రాబోయే రోజుల్లో మరింత క్రియ శీలక సభ్యత్వాలు పెంచాలని కోరారు. సభ్యత్వాలు చేయించిన వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీర మహిళ సంఘ జయంతి, సందీప్, నగేష్, వెంకట సుబ్బయ్య, అశోక్, అభి, రెడ్ రోజ్ కృష్ణ, శ్రావణ్, సాయి, ఠాగూర్, రాజు, వెంకటేష్ తదితర వాలంటీర్లు పాల్గొన్నారు.

చౌడేశ్వరి ఆలయ అభివృద్ధికి విరాళం

విశాలాంధ్ర - బనగానపల్లె : మండల పరిధిలోని నందవరం గ్రామంలో వెలిసిన చౌడేశ్వరి అమ్మవారి ఆలయ అభివృద్ధికి అదే గ్రామానికి చెందిన దాసరి చిన్న చెన్నయ్య, ధర్మపత్ని దాసరి కేశాలమ్మ వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు రూ.25,116 చందాను డెవలప్ మెంట్ కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులకు శుక్రవారం అందజేశారు.

రాష్ట్రస్థాయి వృషభాల పోటీలు

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : పట్టణ పరిధిలోని శ్రీ పాండురంగ విఠలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల భాగంగా శుక్రవారం వృషభాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ రోడ్లు భవనములు, పెట్టుబడుల మౌలిక వసతుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సోదరుడు టిడిపి యువ నాయకుడు బీసీ రామ్నాథ్ రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ వృషబాల పోటీలు టిడిపి యువ నాయకులు కాత్రెడ్డి మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వృషభాల పోటీలలో మొత్తం 11జతల వృషభాలు పాల్గొన్నాయి. ఈ పోటీలో పాల్గొన్న వృషభాలకు దాతలు బహుమతులు అందజేశారు. అందులో భాగంగానే మొదటి బహుమతి ఒక్క లక్షా పదివేలు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆర్కే బుల్స్ ఆ తోటి శిరీష చౌదరి, శివ కృష్ణ చౌదరి గుంటూరు వారు అందుకున్నారు.రెండో బహుమతి కాకి రమేష్ 90 వేల రూపాయలు గరికపాటి లక్ష్మయ్య చౌదరి, గరికపాటి వెంకటేష్ విజయ తెలుగు నిలిచారు. మూడవ బహుమతి కుమార్ అగ్రిగోల్డ్ బోరెడ్డి కేశవరెడ్డి పెద్ద కొట్టాల 70వేల రూపాయలు విజేతలుగా నిలిచారు. నాలుగో బహుమతి ఐదో బహుమతి 50వేల రూపాయలు నారాయణరెడ్డి మహిమున్న మల్లెల విజేతలుగా గెలుపొందారు.

మాతా, శిశు సంరక్షణకు కృషి

విశాలాంధ్ర - చాగలమర్రి : మాతా, శిశు సంరక్షణకు కృషి చేయాలని జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి జగదీష్‌చంద్రారెడ్డి అన్నారు.శుక్రవారం చాగలమర్రి పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య,ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీడీ సీడీ సర్వే 89శాతం మాత్రమే పూర్తయ్యిందని మిగతా 11 శాతం నెల చివరిలోపు పూర్తి చేయాలన్నారు. సుగర్, బిపి, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.డెంగ్యూ,మలేరియా తదితర సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. అనంతరం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేసారు. కార్యక్రమంలో వైద్యురాలు అంజలి, సిహెచ్ఓ రమణమ్మ,సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : క్రీడలు ఆడటం వల్ల శారీరక దృఢత్వం, మానసిక ఉత్సాహానికి క్రీడలు దోహదపడతాయని పీఈటీ పుల్లయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నల్ల కాలువ గ్రామం తెలుగు బాప్తీస్ చర్చ్ సంఘస్తుల ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి జిల్లా స్థాయి కబడ్డీ పోటీల బహుమతి కార్యక్రమానికి పీఈటీ పుల్లయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ క్రీడాకారులు పోటీ తత్వాన్ని అలవర్చుకునే విధాన్ని గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలని జీవితంలో ఇలాంటి విజయాలను మరి ఎన్నో సాధించాలని గెలుపొందిన క్రీడాకారులకు తగిన సూచనలు ఇచ్చి బహుమతి ప్రధానం పీఈటి పుల్లయ్య చేశారు. అనంతరం పీఈటి పుల్లయ్యకు ఘన సత్కారం చేశారు.

తిరంగ యాత్రను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : భారతదేశ గొప్పదన్నాన్ని చాటి చెబుతూ ఈ నెల 18వ తేది ఆదివారం ఉదయం 8.30 గంటలకు నంద్యాల టెక్కె వ్యసాయం మార్కెట్ యార్డు నుంచి గాంధీ చౌక్ వరకు మూడు రంగుల జాతీయ జెండాలతో తిరంగ యాత్రను విజయవంతం చేద్దామని శుక్రవారం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రకటనలో అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు కూటమి పార్టీలు టీడీపీ,బీజేపీ, జనసేన, ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు ఈ తిరంగ యాత్రలో పాల్గొనాలని కోరారు. ఇటీవల భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్త యుద్ధ వాతావరణంలో భారతదేశ సైనికులు చూపిన ధైర్యసాహసం ఎంతో గొప్పదని, భారత సైనికులకు సంఘీభావంగా, దేశ ఐక్యతను చాటుతూ నంద్యాలలో తిరంగ యాత్ర చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సెంట్రల్ సివిల్ సప్లయ్ కమిటీ మెంబర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి, జోనల్ రైల్వే వినియోగదారుల కన్సల్టెంట్ కమిటీ మెంబర్ వెంకట రంగయ్య,బిఎస్ఎన్ఎల్ సలహా కమిటీ సభ్యులు పెరుమాళ్ళ విజయకుమార్,అజయ్, గణపం పుల్లారెడ్డి, పోలూరు నాగేశ్వరరెడ్డి, గోరుకల్లు ఎరుకలయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మైల తిరుణాల

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : పట్టణంలో శ్రీ పాండురంగ విఠలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మైల తిరణాల అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ పాండురంగ విఠలేశ్వర స్వామి రథము గాంధీ సెంటర్ నుండి మెయిన్ బజార్, సంత మార్కెట్, రంగరాజుపేట మీదగా పాండురంగ స్వామి దేవాలయం వరకు రథోత్సవము రంగ రంగ వైభవంగా సాగింది. ఈ తిరుణాల మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి ముక్కులు తీర్చుకున్నారు. తిరుణాల సందర్భంగా సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ మండల అధ్యక్షుడు బివి ప్రసాద్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం నాగేశ్వర్ రెడ్డి, గడ్డం అమర్నాథ్ రెడ్డి, టిడిపి యువ నాయకుడు గువ్వల సుబ్బారెడ్డి, పెనుగొండ శేఖర్, మురళి టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసు నమోదు

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల కేంద్రంలోని 40వ జాతీయ రహదారి ప్రక్కన ఓ అక్రమ నిర్మానానికి అక్రమంగా తీగలకు కనెక్షన్ ఇచ్చుకొని విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. విద్యుత్ మీటర్ లేకుండా కరెంటును వినియోగించుకున్నందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సంబంధిత విద్యుత్ శాఖ లైన్మెన్ విద్యుత్ చౌర్యం గురించి తనకు తెలియదని తాను బిల్ రికవరీ పై విధులలో ఉన్నానని సమాధానం ఇచ్చారు. మరోపక్క గ్రామ పంచాయతీ అప్రూవల్ అనుమతి పొందకుండానే నిర్మాణం చేపట్టినట్లు గ్రామపంచాయతీ తరపున నోటీసులు జారీ చేయనున్నట్లు సమాచారం.

మరిన్ని వార్తలు E-PAPERలో

సీఎం గారు.. మా మొర ఆలకించరా..!

- రాయలసీమను కరువు రక్కసి నుండి కాపాడండి
- వలసల నివారణకు మీరు చెప్పినట్లుగా శాశ్వత పరిష్కారం చూపండి
- రాయలసీమ యూనివర్శిటీపై దృష్టి సారించండి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ముఖ్యమంత్రి గారు జిల్లాలో నిత్యం కరువు రక్కసితో ప్రజలు కాపురం చేస్తున్నారు. ఒక ఏడాది అతివృష్టి - మరో ఏడాది అనావృష్టితో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులు అప్పుల్లో పుట్టి, అప్పులో పెరిగి చివరకు అప్పుల్లోనే చనిపోతున్నారు. కరువుతో జిల్లాలోని పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం, ఆదోని, కోడుమూరు ప్రాంతాల రైతులు ప్రతి ఏడాది వలసలు పోవడం సర్వసాధారణమైంది. ముంబాయి, బెంగుళూరు, హైదరాబాద్, గుంటూరు, క్రిష్టా, ఆదిలాబాద్ జిల్లాలకు తరచూ వలస పోతున్నారు. వలసలు పోయిన చోటు అనారోగ్యానికిగురై మృత్యువాత పడుతున్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి, హంద్రీనివా సుజలస్రవంతి ద్వారా 106 చెరువులను నింపడం వంటి తదితర కార్యక్రమాలు చేపట్టాలి. ఇక్కడ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. ఫ్యాక్షన్ కోరల్లో చిక్కుకున్న గ్రామాలు ఇప్పుడిప్పుడే ఫ్యాక్షన్ వీడి స్వేచ్ఛా వాతావరణం కోరుతున్నారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలను ఉన్నత విద్యను చదివించుకుంటున్నారు. అయితే వారికి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. చదువుకున్న యువత గ్రామాల్లో ఖాళీగా ఉంటే మరోసారి ఫ్యాక్షన్ బాటపట్టే అవకాశాలు లేకపోలేదు. వారికి అలాంటి ఆలోచన రాకముందే చదువుకున్న యువతకు ఏదో ఓ విధమైన ఉపాధి కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. 2014 రాష్ట్ర విభజన తరువాత మొదటి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కర్నూలులో నిర్వహించారు. ఆ వేడుకల్లో ముఖ్యమంత్రి హెూదాలో మీరు జిల్లాలోని గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్ లాంటి ప్రాజెక్టులు పూర్తిచేస్తామని, ఓర్వకల్లును ఇండస్ట్రీయల్ హబ్ చేస్తామని హామీ ఇచ్చారు. 1953లో కర్నూలు రాజదానిని పోగొట్టుకున్నాము. ఆ స్థాయిలో మాకు న్యాయం జరుగాలి. గత ప్రభుత్వం మూడు రాజదానుల పేరుతో జిల్లాకు న్యాయ రాజదాని ఇస్తామని ప్రజలను మభ్యపెట్టి చివరకు హైకోర్టు కాదు కదా కనీసం బెంచ్‌కూ తేలేకపోయింది. ఒక్క పరిశ్రమకు కూడా తీసుకురాలేదు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదు. జిల్లా ప్రజలకు తీవ్ర అన్యాయం చేసింది. దాని పర్యావసానం 2024 ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ఉమ్మడి జిల్లాల ప్రజలు మీకు రెండు ఎంపీలు, 12 శాసనసభ స్థానాల్లో విజయం చేకూర్చి అండగా నిలిచారు. ఈసారైనా ఇచ్చిన హామీలు ముఖ్యంగా హంద్రీనివా సుజస్రవంతి ద్వారా 106 చెరువులను నింపడం, వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులు పూర్తి చేయడం, ఓర్వకల్లును ఇండస్ట్రీయల్ హబ్‌గా మార్చడం లాంటివి చేపట్టాలి. రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని, కరువు రక్కసిని ఇక్కడ నుండి పారద్రోలుతామని మీరు ఇచ్చిన హామీని అమలు చేయాలని కర్నూలుకు వచ్చిన మీరు ఈదిశగా ప్రజలకు నెరవేరుస్తారని ఆశిస్తున్నారు. కర్నూలులో ఉన్న రాయలసీమ యూనివర్శిటీ భూములు కబ్జా, యునివర్శిటీపై అవినీతి ఆరోపణలు, ఉద్యోగులపై దాడులు, కేసులు ఇలా పీహెచ్‌డీలు కూడా అంగట్లో సరుకుల్లా అమ్ముకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. వీటిపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. యూనివర్శిటీలో నెలకొన్న పరిస్థితులను సమీక్షించి, కఠినంగా వ్యవహరించి యూనివర్శిటీలో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రజానాట్య మండలి పాటలతో ప్రజల్లో చైతన్యం నింపాలి

విశాలాంధ్ర - ఆదోని : ప్రజానాట్యమండలి కళాకారుల పాటలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు చైతన్యపరులై ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఆదోనిలో రెండోరోజు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లాస్థాయి శిక్షణ తరగతులకు సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య హాజరై మాట్లాడారు. ప్రజానాట్యమండలి కళాకారుల ప్రాధాన్యత నేటి సమాజంలో చాలా ప్రాముఖ్యతతో కూడుకున్నదని, రోజు రోజుకు పెరుగుతున్న అసమానతల కొరకు అధిక ధరలకు, అవినీతికి వ్యతిరేకంగా కలల ద్వారా ప్రజలను చైతన్య పరచడానికి దోహదపడతాయన్నారు. ప్రజానాట్య మండలి శిక్షణ తీసుకుంటున్న కళాకారులు ప్రస్తుత సమాజంలో నెలకొన్న సమస్యలపై గళం విప్పాలని కోరారు. మాటకంటే పాట పదునైనదని, ప్రజలు పడే బాధలు, కష్టాలు, పాటల ద్వారా చైతన్య పరచడంలో ప్రజానాట్య మండలి ఎంతో ఉపయోగపడుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు, పట్టణ, మండల కార్యదర్శిలు సుదర్శన్, కల్లుబావిరాజు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఓబీ నాగరాజు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొత్తూరు గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు కర్నూలులో పర్యటించే అర్హత లేదు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాల పేరుతో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చెయ్యకుండా కాలయాపన చేస్తున్న ఏపీ సీఎం చంద్రబాబుకు కర్నూలు జిల్లా పర్యటించే అర్హత లేదని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గిడ్డమ్మ, నగర కార్యదర్శి వి.భారతిలు అన్నారు. శుక్రవారం సిఆర్ భవన్‌లో ఏపీ మహిళా సమాఖ్య ముఖ్యల సమావేశం నగర ఉపాధ్యక్షురాలు పావని అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గిడ్డమ్మ, భారతీలు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు, 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళలకి నెలకు 1500 రూపాయలు, తల్లికి వందనం పేరుతో కుటుంబంలో ప్రతి ఒక్క విద్యార్థికి సంవత్సరానికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టి సంవత్సరం గడుస్తున్నా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ఎందుకు నెరవేర్చ లేదని వారు ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు వారిచ్చిన హామీలు అమలు చేయడానికి ఎంత డబ్బు అవసరం వస్తదో 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడుకు తెలియదా అని వారు ప్రశ్నించారు. ఇప్పటకైనా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటలకు పరిమితం కాకుండా ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీ ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు, తల్లికి వందనం నిధులు కేటాయించి తర్వాతనే జిల్లాలో పర్యటించాలన్నారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య నగర నాయకురాలు మునెమ్మ, రేణుక, రాబియా, సోపియా, సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.

22న సీపీఐ జిల్లా సమితి సమావేశం : బి.గిడ్డయ్య

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఈ నెల 22న సీపీఐ జిల్లా సమితి సమావేశం సీఆర్ భవన్‌లో జరుగుతుందని ఈ సమావేశానికి సీపీఐ సమితి సభ్యులు సకాలంలో హాజరు కావాలని జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తెలిపారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్యలు హాజరైతారని తెలిపారు. జిల్లా సమితి సభ్యులు, ఆహ్వానితులు, సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

అనేక ఫిర్యాదులందుతున్నాయి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలు వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించడం, ప్రైవేట్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులను అడ్మిషన్ల కొరకు కాంపెయిన్ చేయించడం. నేరుగా ఫిర్యాదు చేస్తే వారికి ఉద్యోగభద్రత ఉండదనే ఉద్దేశ్యంతో ఆయా సంఘాలతో కార్యాలయానికి ఫిర్యాదులు అందుతున్నాయని డీఈవో ఎస్.సామెల్ పాల్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వేసవిలో పాఠశాలలు నిర్వహించినా, అడ్మిషన్ల కొరకు ఉపాధ్యాయులను ఇంటింటికి పంపి ప్రచారం చేయించినా, పాఠశాలలు ప్రచారం నిమిత్తం ఫ్లెక్సీలు అడ్వర్టైజ్మెంట్లు చేసినా, ఆయా పాఠశాలలపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సిలబస్ మాత్రమే అమలు చేయాలని, ఇష్టానుసారంగా పోటీతత్వం పేరుతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తే ఆయా పాఠశాలలపై ఉక్కుపాదం మోపి అనుమతులు రద్దు చేయడం జరుగుతుందన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ఉద్యమ కార్యాచరణ

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు: గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలతో కమిషనర్ గత 30 సమావేశాలు నిర్వహించినప్పటికి, ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేసిన అనేక విషయాలు ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించని కారణంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ద్వారా ఉద్యమ కార్యాచరణ రూపొందించినట్లు ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రధానంగా తెలుగు మీడియంను ఇంగ్లీష్ మీడియంతో పాటు సమాంతరంగా కొనసాగించాలని, ఉన్నత పాఠశాలలో సర్ ప్లస్‌గా గుర్తించబడిన స్కూల్ అసిస్టెంట్లను ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నిష్పత్తి 1:45గా నిర్ణయించి నియమించాలన్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్‌లకు పీఎస్ హెచ్‌ఎం పోస్టు ఎస్జీటీలకు పదోన్నతులు ద్వారా ఇవ్వాలని, బదిలీలలో పోస్టులను బ్లాక్ చేయరాదన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

విశాలాంధ్ర- వెల్దుర్తి : మండల పరిధిలోని చెరుకులపాడు, కుసనపల్లె, గ్రామాల్లో కిశోర బాలికల వికాసం కార్యక్రమం ఐసీడీఎస్ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. కిశోర వికాస కార్యక్రమాన్ని ఉద్దేశించి డిస్టిక్ ఆఫీసర్ డి.శైలజ కుమార్, ఆర్కేఎస్‌కే జిల్లా అధికారి డాక్టర్ మల్లికార్జున, జిల్లా ఫ్లోరిన్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్, మాట్లాడుతూ బాలికలకు రక్తహీన గురించి క్లుప్తంగా వివరించారు. యుక్త వయసులో వచ్చే మార్పులు, సమస్యల గురించి అవగాహన కల్పించారు. సూపర్వైజర్ సరస్వతి, ఏఎన్ఎం అన్నపూర్ణాదేవి, సుమలత, నిర్మల, అనంతమ్మ, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు

గద్వాల సోమన్న సప్తతి పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర - పెద్దకడబూరు : గద్వాల సోమన్న సప్తతి పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. మండలత పరిధిలోని కంబదహాల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు డా.గద్వాల సోమన్న 70వ పుస్తకం సప్తతి పుస్తకావిష్కరణ కేంద్రీయ విశ్వ విద్యాలయం, హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆచార్య డా.దార్ల వెంకటేశ్వరరావు, శతాధిక పుస్తకాల ప్రచురణ కర్త డా.వైరాగ్యం ప్రభాకర్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి, విజిటింగ్ ప్రొఫెసర్ డా కాంచనపల్లి గోవర్ధన్ రాజు శుక్రవారం ఘనంగా జరిగింది. తెలంగాణ బాష సాంస్కృతిక శాఖ, భవానీ సాహిత్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన, శతాధిక కవుల సమ్మేళనంలో కవి గద్వాల సోమన్న పుస్తకావిష్కరణ జరగడం గమనార్హం. అనంతరం ఈ పుస్తకాన్ని కేవీ నాగేశ్వరరావుకు అంకితమిచ్చారు. పుస్తక కృతికర్త గద్వాల సోమన్నను సాహితీ మిత్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

347 మంది విద్యార్థులు గైర్హాజరు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లాలో ఇంటర్ ప్రథమ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 8660 మంది అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు నమోదు చేసుకున్నారు. శుక్రవారం ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ప్రథమ సంవత్సరం 2:30 నుంచి 5:30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్ష నిర్వహించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 1498 హాజరయ్యారు. పరీక్షకు 347 గైర్హాజరయ్యారు. రెండో పరీక్షకు 1498 హాజరయ్యారు కాగా, 101 పరీక్షకు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను కన్వీనర్ ఆర్ఐఓఎస్‌వీఎస్ గురువయ్య శెట్టి, డీవీఈఓ సురేష్ బాబు, జిల్లా డీఈసీ సభ్యులు జి.లాలప్ప, సూర్యచంద్ర, పద్మావతితో పాటు ఫ్లయింగ్, సిట్టింగ్స్ క్వార్డులు పర్యవేక్షించారు.

బ్లడ్ బ్యాంక్ ద్వారా ఎందరికో ప్రాణదానం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: నగరంలో ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ద్వారా ఎందరుకో ప్రాణాపాయం నుంచి కోలుకున్నారని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. శుక్రవారం టీజీ వెంకటేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన మెగా బ్లడ్ డొనేషన్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్రూపు రాజకీయాల వల్ల అభివృద్ధి బాగా కుంటుపడేదని అన్నారు. తాను ఎమ్మెల్యేగా మంత్రిగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినప్పటికీ కొంతమంది రాజకీయ నాయకులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తేవడం వల్ల పనులు సక్రమంగా జరిగేవి కావన్నారు. ఎంతోమంది రోగులకు ఉపయోగపడే బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు కొరకు స్థల సేకరణకు అడ్డుకున్నారని, ఈరోజు అదే బెడ్ బ్యాంకు వల్ల సంవత్సరానికి పదివేల యూనిట్ల ఇవ్వగలుగుతున్నామని అన్నారు. దీని ద్వారా ఎంతోమంది రోగుల ప్రాణాపాయం తప్పుతుందన్నారు. పంచలింగాల వద్ద రైల్వే ప్రాజెక్టును అప్పటి కేంద్ర రైల్వే సహాయ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి సహకారంతో తీసుకురావడం జరిగిందని దానిని కూడా అడ్డుకునేందుకు ప్రయత్నించారని అన్నారు. అది ఇప్పుడు త్వరలోనే ప్రారంభం కానుందని టీజీ తెలిపారు. చిరంజీవి బ్లడ్ బ్యాంకు పెట్టిన తర్వాత ప్రతి ఒక్కరిలో రక్తదానం పై మంచి అవగాహన కలిగిందన్నారు. అప్పటికంటే ముందే కర్నూలు బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత కర్నూలు రెడ్ క్రాస్ సొసైటీకి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి, కేజీ గోవింద్ రెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, శ్రీనివాస్, ఎస్కే మహేష్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి

విశాలాంధ్ర - సి.బెళగల్: లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు మోహన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్మిక హక్కులను, సమ్మె హక్కులను, ట్రేడ్ యూనియన్ హక్కులను, కంపెనీలను ప్రశ్నించే హక్కులను లేకుండా మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడు లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ మోహన్ డిమాండ్ చేశారు .

ఆపరేషన్ సింధూర్ విజయవంతంపై టీడీపీ ర్యాలీ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : పాకిస్తాన్ ఉగ్రమూకలపై భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో ఎన్డీఏ పక్షాలు భారీ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద నుండి ప్రారంభమైన యాత్రకు పరిశ్రమల శాఖ మాత్యులు టీజీ పాల్గొని ప్రారంభించారు. తిరంగా యాత్రకు జిల్లా టీడీపీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కా రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆదోని నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ పార్థసారథి, బీజేపీ జిల్లా అధ్యక్షులు రామక్రిష్ణ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు సురేష్‌లతో పాటు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆపరేషన్ సింధూర్‌కి, వీరోచితంగా పోరాడి విజయం సాధించిన భారత త్రివిధ దళాల సైనికులకు మద్దతుగా ఆత్మీయమైన సంఘీభావం తెలుపుతూ జిల్లా పరిషత్ కార్యాలయం నుండి కలెక్టర్ ఆఫీసు వరకు తిరంగా ర్యాలీ నిర్వహించడమైనది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వై.నాగేశ్వరరావు యాదవ్, కేవీ సుబ్బా రెడ్డి, నంద్యాల నాగేంద్ర, పద్మలతా రెడ్డి, పేరపోగు రాజు, నంది మధు, జేంస్, రామాంజనేయులు, పౌల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

లాస్య రెడ్డికి ఎమ్మెల్యే ఘన సన్మానం

విశాలాంధ్ర-పత్తికొండ: సీబీఎస్ ఈ పదవ తరగతి పరీక్ష ఫలితాలలో రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకు సాధించిన పత్తికొండకు చెందిన లాస్య రెడ్డిని శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఘనంగా సన్మానించి ల్యాప్ టాప్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల వెలువడిన సీబీఎస్ఈ ఫలితాలలో పత్తికొండకు చెందిన లాస్య రెడ్డి ఆల్ ఇండియా మూడవ ర్యాంకు, రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. లాస్య రెడ్డి భవిష్యత్తులో మంచి ఉన్నత చదువులు చదివి పత్తికొండ నియోజకవర్గానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు, తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు సాంబ శివారెడ్డి, మండల కన్వీనర్ కడవల సుధాకర్, నాయకులు తిరుపాల్ నాయుడు, చెన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైంది

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ఎస్టీయూ సీనియర్ నాయకునికి ఘనంగా పదవీ విరమణ ఆత్మీయ అభినందన సభలి నగరంలోని సలాం ఖాన్ ఎస్టీయు భవనం నందు రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న అధ్యక్షతన జరిగింది. శుక్రవారం కోడుమూరు మండలం వర్కూరు గ్రామం నందు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేసి గత నెల30న పదవి విరమణ పొందిన కే నాగేశ్వరరావు ఆత్మీయ సన్మాన అభినందన సభ జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి టీకే జనార్ధన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.వెంకటేశ్వర్లు బి.సుంకన్నలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి మాట్లాడుతూ అన్ని వృత్తుల్లోకెల్లా ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండి పదవి విరమణ చెందడం సంతోషదాయకమన్నారు. నాగేశ్వరావు గారు నీతి, నిజాయితీ, నిబద్ధత, సమయపాలన, అంకితభావంతో ఉపాధ్యాయ వృత్తిని నిర్వర్తిస్తూ ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతూ మరోపక్క రాష్ట్రోపాధ్యాయ సంఘంలో క్రియాశీల నాయకుడిగా ఉంటూ విద్యా ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు ఆయన విద్యాభివృద్ధికి, సంఘానికి చేసిన సేవలను కొనియాడారు. తదనంతరం దంపతులిద్దరిని ఘనంగా సన్మానించడం జరిగింది. సన్మాన గ్రహీత నాగేశ్వర రావు మాట్లాడుతూ వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో నిరంతరం సత్సంబంధాలు కలిగి ఉండి విద్యాభివృద్ధికి కృషి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మహమ్మద్ షఫీ, ప్రసన్నరాజు, రామ్మోహన్ రెడ్డి, నాగేంద్రప్ప, సత్యనారాయణ, కుంపటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశిం చారు. నేడు తేదీన ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం ప్రజా వేదిక, సి.క్యాంప్ రైతు బజార్, స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర పార్క్ భూమి పూజ కార్యక్రమాలకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఏపీ సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజా వేదిక వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకి సంబంధించి ప్రజల నుండి అర్జీలు తీసుకునేందుకుగాను కౌంటర్ ఏర్పాటు చేయడంతో పాటు బ్యానర్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డ్వామా, డీఆర్డీఏ, పీడీలను ఆదేశించారు. స్టేజ్ ఏర్పాట్లు, స్టాల్స్ ఏర్పాట్లు, కాన్వాయ్, వీఐపీ పార్కింగ్ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర పార్క్ ఏర్పాట్లను పరిశీలిస్తూ పరిసర ప్రాంతాల్లో కిందకి ఉన్న కరెంట్ తీగలను 20 అడుగులపైకి లేపాలని కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం సి.క్యాంప్ రైతు బజార్ లో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలిస్తూ షాప్‌లు అన్ని మునుపటి లాగే తెరిచి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మార్కెటింగ్ అధికారులను ఆదే శించారు. కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు..

నారా చంద్రబాబు నాయుడు కర్నూలు పట్టణంలో పర్యటించనున్న నేపథ్యంలో బందోబస్తు నిమిత్తం విచ్చేసిన పోలీసులకు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ నంద్యాల చెక్ పోస్టు సమీపంలోని కేంద్రీయ విద్యాలయంకు ఎదురుగా ఉన్న మెగాసిరి ఫంక్షన్ హాల్‌లో పలు సూచనలు, సలహాలు చేసి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కర్నూలు పట్టణంలో ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో, సిఎం కాన్వాయ్, సభ ప్రాంగణం, తదితర ప్రాంతాలలో బందోబస్తు విధులు నిర్వహించే మఫ్టీ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసు బృందాలు, పోలీసు జాగీలాలు, బాంబ్ స్క్వాడ్ బృందాలతో పోలీసు అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏలాంటి సంఘటనలు జరగకుండా భద్రత పరంగా పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకో వాలన్నారు. చేయకూడనవి, చేయవలసిన వాటికి గురించి తెలిపారు. అడిషనల్ ఎస్పీలు నలుగురు, 11 మంది డిఎస్పీలు, 53 మంది సిఐలు, 101 మంది ఎస్సైలు, 383 మంది ఎఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్ళు, 680 మంది కానిస్టేబుళ్ళు, 51 మంది మహిళా పోలీసులు, 416 మంది హెూం గార్డులు, 5 సెక్షన్ల ఏ ఆర్ సిబ్బంది, 6 స్పెషల్ పార్టీ బృందాలను బందోబస్తు విధులకు కేటాయించారు. కర్నూలు జిల్లా ఎస్పీతో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్ కర్నూలు రేంజ్ పరిధిలోని అడిషనల్ ఎస్పీలు, డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నూతన వధూవరులు జీవితాంతం సుఖ, సంతోషాలతో వర్ధిల్లాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: తన జన్మదిన సందర్భంగా పెళ్లి చేసుకున్న జంటలందరూ జీవితాంతం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. స్థానిక మౌర్య ఇన్ కాంప్లెక్స్, పరిణయ ఫంక్షన్ హాల్ నందు ఈరోజు వివాహం చేసుకున్న జంటలందరికీ టీజీ కుటుంబ సభ్యులందరూ తమ ఆశీర్వాదాన్ని అందజేశారు. పెళ్లి చేసుకున్న 75 జంటలకు ఒక్కొక్క జంటకు రూ.80 వేలు చొప్పున డీడీలను, చెక్కులను రాష్ట్ర మంత్రివర్యులు టీజీ భరత్ దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ పెళ్లి చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న వారు ఎలాంటి చెడు వ్యసనాలకు లోను కాకుండా ఆరోగ్యంగా ఉంటూ సంసారాన్ని చక్కదిద్దుకోవా లన్నారు. తన కుమారుడు మంత్రి భరత్‌తో పాటు కుటుంబ సభ్యుల సహకారం ఉన్నందునే తాను సేవా కార్యక్రమాలు నిర్వహించ గలుగుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో టీజీ రాజ్యలక్ష్మి, టీజీ శిల్ప, టీజీ కుటుంబ సభ్యులు సునీల్, కృష్ణజోష్ణ, రవిరాజ్, మౌర్య తదితరులు పాల్గొన్నారు.

కెమిస్ట్రీ సబ్జెక్టులో డాక్టోరల్ రివ్యూ సమావేశం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: రాయలసీమ యూనివర్సిటీ రీసర్చ్ విభాగంలో ఫేక్ డాక్టరేట్ కలకల మంటూ వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని వర్సిటీ ఓ ప్రకటనలో రిజి స్ట్రార్ తెలిపారు. గతనెల 19న కెమిస్ట్రీ సబ్జెక్టులో డాక్టోరల్ రివ్యూ కమిటీ సమావేశం వర్సిటీలో జరిగిన మాట వాస్తవమేనన్నారు. వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన ముగ్గురు ఆచార్యు లతోపాటు, వర్సిటీలోని సంబంధిత విభాగాధిపతి, రీసర్చ్ డైరెక్టర్ సభ్యులుగా కలిగిన రివ్యూకమిటీకి పరిశోధకులు తమతమ పరిశోధనా పురోగతిని సమర్పించాల్సి ఉంటుందన్నారు. కెమిస్ట్రీ విభాగానికి చెందిన ఇతర పరి శోధకులతోపాటు పి.లింగేశ్వర్ రెడ్డి అనే రీసర్చ్ స్కాలర్ హాజరవడానికి వచ్చాడని ఆయన తెలిపారు. వర్సిటీ నిబంధనలకు అనుగుణంగా ప్రచురించిన పరిశోధనా పత్రాలతో పాటు, థీసిస్ డ్రాఫ్ట్ కాపీ, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ తయారుచేసి తీసుకురాలేక పోవడంతో అతనిని తదుపరి జరిగే రివ్యూకు హాజరు కావలని రివ్యూకమిటీ సూచించిందన్నారు. కమిటీ సూచనలను ఈ నెల ఒకటో తేదీన సంబంధిత రీసర్చ్ స్కాలర్‌కు కవరింగ్ లెటర్‌తోపాటు మెయిల్ ద్వారా తెలియజేయడం జరిగిందన్నారు. సరైన కమిటీ రిపోర్టును జతచేస్తూ ఈ నెల 13 వతేదీన మరొక మెయిలు పంపినట్లు ఆయన వివరించారు. ఈ విషయంలో ఎలాంటి నియమ నిబంధనల ఉల్లంఘన జరగలేదన్న విషయాన్ని గమనించాల్సిందిగా ఆయన సూచించారు.

కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాల భవనానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-మంత్రాలయం: మండలంలోని చిలకలడోణ గ్రామంలో రూ.1.22 కోట్ల నిధులతో కస్తూర్బా గాంధీ నూతన జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి మంత్రాలయ నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్.విష్ణువర్ధన్ రెడ్డిలు భూమి పూజా చేశారు. అనంతరం ఇంచార్జ్ మాట్లాడుతూ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను నాణ్యతగా చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కి ఇంచార్జ్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పని చేస్తున్నమన్నారు. ఎన్నో సంవత్సరాలుగా విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు త్వరలోనే తొలగనున్నాయని బాలికల విద్యకు కూటమి ప్రభుత్వ చాలా ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మండల ఎంఈవో మొయినుద్దీన్, ప్రిన్సిపాల్ శాంతి, రంగరాజు, మండల నాయకులు మాజీ జెడ్పీటీసీ ఆర్.లక్ష్మయ్య, గోపాల్ రెడ్డి, చిలకలడోణ మాజీ సర్పంచ్ లు హనుమంతు, నర్సన్న పవన్, గోపాల్, వీరేష్, మాలపల్లి లక్ష్మన్న, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌యూలో ఫేక్ డాక్టరేట్‌ల రగడ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: రాయలసీమ యూనివర్శిటీలో ఫేక్ డాక్టరేట్‌లు ఇస్తున్నారనే రగడ జరుగుతుంది. ఈనెల 19న ఒక ప్రముఖ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వ్యక్తికి డాక్టరేట్ ఇచ్చేందుకు సర్వం సిద్ధం చేశారు. 2009 ఒకసారి రిజిస్టర్ చేసుకుని దానిని రద్దుచేసుకున్న ఆ వ్యక్తి 2019 మరోసారి పిహెచ్‌డీ చేసేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆయనకు ఉన్న పలుకుబడితో డీసీఎంలో ఎటువంటి పేపర్ ప్రజెంటేషన్ లేకుండానే ఫైల్ తయారు చేసినట్లు తెలుస్తుంది. సదురు వ్యక్తికి ఎలాగైనా పీహెచ్‌డీ పట్టా ఇవ్వాలని నిర్ణయం తీసుకున్న వ్యక్తులు ఇప్పటికే కమిటీ సభ్యులందరూ సంతకాలు పెట్టినట్లు తెలుస్తుంది. ఎలాంటి ప్రజంటేషన్ లేకుండా రికార్డులు లేకుండా హెచ్‌ఓడీ సంతకం పెట్టాలని వత్తిడి తీసుకువస్తున్నట్లు తెలుస్తుంది. కమిటీ ముందు పేపర్ ప్రజంటేషన్ లేకుండానే వచ్చారని ఎలా సంతకాలు చేయాలని కెమిస్ట్రి డిపార్టుమెంట్ హెచ్‌ఓడి ప్రొఫెసర్ రాణీ సంతకాలు నిరాకరించినట్లు తెలుస్తుంది. సంతకాలు చేయాలని పలువురు వత్తిడి చేస్తున్నట్లు తెలుస్తుంది. సంబంధిత హెచ్‌ఓడి ప్రమేయం లేకుండానే అన్ని జరిగిపోవడంపై హెచ్‌ఓడి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేపర్ ప్రజెంటేషన్ లేకుండా, రికార్డులు లేకుండా తాను సంతకం చేయనని, అసలు రీసర్చ్ డైరెక్టర్ విశ్వనాథరెడ్డి తనకు సరిగ్గా సమాచారం ఇవ్వకుండా డీసీఎం మీటింగ్ ఏర్పాటు చేశారని హెచ్‌ఓడీ రాణి అంటున్నారు. స్కాలర్‌కు తాను గైడ్‌గా కొనసాగేందుకు సిద్ధంగా లేనని, అవసమైతే అతను నిరభ్యంతరంగా తన రిజిస్ట్రేషన్ రద్దు చేసుకోవచ్చని కోరినట్లు ఆమె తెలిపారు.

వివాహో వేడుకల్లో కేంద్ర మంత్రి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలోని జీఆర్సీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్న కుమార్తె వివాహో వేడుకల్లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్ర బాబు కుమార్తె వివాహో వేడుకల్లో పాల్గొనేందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఎంపీ నాగరాజుతో కలిసి అనంతపురం బయలుదేరి వెల్లారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

ఆర్యవైశ్యుల అభివృద్ధిలో టీజీ కీలకం

విశాలాంధ్ర - బనగానపల్లె : ఆర్యవైశ్యుల అభివృద్ధిలో మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ ఎంతో కీలకమని విద్య వైద్య వ్యాపార రంగాలలోనే కాకుండా రాజకీయ రంగాలలో కూడా ఆర్యవైశ్యులు అభివృద్ధి చెందాలని ముందుకు రావాలని ఆకాంక్షించిన గొప్ప వ్యక్తి అని టీజీ వెంకటేష్ సేవలను ప్రపంచార్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు, బనగానపల్లె నియోజకవర్గం ఆర్యవైశ్య ప్రముఖులు టంగుటూరి శీనయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని అమ్మవారి శాల నందు శ్రీ కన్యకా పరమేశ్వరి మాత అమ్మవారి ఆలయంలో టీజీ వెంకటేష్ జన్మదిన సందర్భంగా ప్రపంచార్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగాల నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులందరూ కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీజీ వెంకటేష్ ఆయురారోగ్యంగా అష్టైశ్వర్యాలతో జీవితం కొనసాగాలని అమ్మవారిని శీనయ్య కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల మహిళా జిల్లా అధ్యక్షురాలు బండారు లలిత, ఆదావేణి లక్ష్మి, భరతుడు, బండారు ప్రకాష్, ఎస్ ఎస్ ఎం, బింగిమల్ల సుబ్రమణ్యం, నూకల విజయుడు, నల్లగట్ల వెంకటేశ్వర్లు, వీఎస్ఎస్ నారాయణ, నూకల మధు, కాఫీ పొడి శివ, నూకల శీను, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

వార్షిక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా అన్ని శాఖల వార్షిక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి నివేదికలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అభివృద్ధి 2025-26 కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఓ వేణుగోపాల్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు సమర్థవంతమైన ప్రణాళికలు రూపొందించాలని అన్ని శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇందులో భాగంగా వ్యవసాయానికి సంబంధించి 50 ఎకరాల్లో సాగవుతున్న ప్రకృతి వ్యవసాయానికి అదనంగా మరో 25 ఎకరాలకు పెంచే ప్రణాళికలు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. డ్రోన్ టెక్నాలజీ ద్వారా వ్యవసాయాన్ని చేపట్టేందుకు ఇదివరకే 40డ్రోన్స్ వినియోగించారని మరో 40డ్రోన్ల వినియోగం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. హార్టికల్చర్ కు సంబంధించి పోస్ట్ ప్రొడక్షన్ లో భాగంగా కాపుకు వచ్చిన పండ్లకు కవర్స్ వేసే ప్రక్రియ చేపడితే అధిక దిగుబడి వస్తోందని ఆ దిశలో ప్రణాళికలు రూపొందించాలని ఉద్యాన శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. కోల్డ్ స్టోరేజ్ యూనిట్స్, కలెక్షన్ సెంటర్ల వివరాలను నివేదికలో చేర్చాలన్నారు. పశు సంవర్ధక శాఖకు సంబంధించి జిల్లాలో 77వేల మంది దగ్గరే పశు సంపద ఉందని, వీటిని లక్ష వరకు పెంచేలా చర్యలు తీసుకోవడంతో పాటు పాల ఉత్పత్తిని పెద్ద ఎత్తున పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. మత్స్య శాఖకు సంబంధించి 63వేల మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తి పెంచడంతో పాటు సీడ్ ఉత్పత్తిని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మైనింగ్ కు సంబంధించి ఉపయోగంలో లేని మైనింగ్ పరిశ్రమలను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుండి ఎంఎస్ఎంఈ పార్క్ లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖకు సంబంధించి పిఎం సూర్య ఘర్ ద్వారా కనెక్షన్లు అందజేసి లబ్ధిదారులను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. పిఎం కుసుమ్ కు సంబంధించి 500ఎకరాల భూసేకరణ పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఏపి టూరిజం స్టార్ హోటల్ కోసం రెండు ఎకరాల స్థలం కేటాయించడం జరిగిందని వాటి నిర్మాణానికి సాధ్య సాధ్యాలపై పరిశీలించి తదుపరి చర్యలు గైకొనాలని టూరిజం అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే రవాణా, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ, నేషనల్ హైవే, హౌసింగ్, టిడ్కో, స్కిల్ డెవలప్మెంట్, ఉపాధి కల్పన, ఆర్డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్, డిఆర్డిఎ, మెప్మా, డ్వామా, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, సివిల్ సప్లైస్, విద్యా, వైద్య, ఆరోగ్య శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, ఆర్టీసీ, ఫుడ్ సేఫ్టీ, ఎస్సీ కార్పోరేషన్ తదితర శాఖల కార్యాచరణ ప్రణాళికలను కలెక్టర్ పరిశీలిస్తూ చేర్చాల్సిన అంశాలపై సంబంధిత అధికారులను ఆదేశించారు.

చౌడేశ్వరి అమ్మవారికికి పల్లకి సేవ

విశాలాంధ్ర - బనగానపల్లె : మండల పరిధిలోని నందవరం గ్రామంలో వెలిసిన చౌడేశ్వరి అమ్మవారికి దేవస్థానం నందు శుక్రవారం సందర్భంగా పల్లకి సేవ కార్యక్రమం ఈవో కామేశ్వరమ్మ, ఆలయ పండితులు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమము నందు మాజీ చైర్మన్ పివి కుమార్ రెడ్డి, అర్చకులు, ఆలయ సిబ్బంది రామ్మోహన్, మణికంఠ, నాగేశ్వరరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏ మృతి, ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని మహదేవపురం గ్రామానికి చెందిన వీఆర్ఏ కె.వెంకటసుబ్బయ్య (59) శుక్రవారం మృతి చెందినట్లు తహశీల్దార్ పుష్పకుమారి తెలిపారు. అనారోగ్యం కారణంగా విధి నిర్వహణలో ఉన్న తలారి వీఆర్ఏ మృతి చెందడం పట్ల బాధిత కుటుంబం శోకసంద్రంలో మునిగింది. సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ పుష్పకుమారి తక్షణ సాయం అందించాలని ఆదేశించారు. వీఆర్వో టి.చెన్నయ్య గ్రామపంచాయతీ కార్యదర్శి బట్టు కుమార్ రమణ బాధిత కుటుంబ సభ్యులకు 25000 రూపాయలు తక్షణ సహాయంగా అందజేశారు. గ్రామంలో వీఆర్ఏ గా విశేష సేవలు అందించి మంచి పేరు గడించినట్లు పంచాయతీ కార్య దర్శి పేర్కొన్నారు.

ఆపరేషన్ సింధూర్ విజయవంతంపై టీడీపీ ర్యాలీ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : పాకిస్తాన్ ఉగ్రమూకలపై భారత సైన్యం చేపట్టిన ఆపరే షన్ సింధూర్ విజయ వంతం కావడంతో ఎన్డీఏ పక్షాలు భారీ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద నుండి ప్రారంభమైన యాత్రకు పరిశ్రమల శాఖ మాత్యులు టీజీ పాల్గొని ప్రారంభించారు. తిరంగా యాత్రకు జిల్లా టీడీపీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కా రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆదోని నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ పార్థసారథి, బీజేపీ జిల్లా అధ్యక్షులు రామక్రిష్ణ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు సురేష్‌లతో పాటు కూటమి పార్టీల నాయకులు, కర్య కర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆపరేషన్ సింధూర్‌కి, వీరోచితంగా పోరాడి విజయం సాధించిన భారత త్రివిధ దళాల సైనికులకు మద్దతుగా ఆత్మీ యమైన సంఘీభావం తెలుపుతూ జిల్లా పరిషత్ కార్యాలయం నుండి కలెక్టర్ ఆఫీసు వరకు తిరంగా ర్యాలీ నిర్వహించడమైనది. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు వై.నాగేశ్వరరావు యాదవ్, కేవీ సుబ్బా రెడ్డి, నంద్యాల నాగేంద్ర, పద్మలతా రెడ్డి, పేరపోగు రాజు, నంది మధు, జేమ్స్, రామాంజనేయులు, పాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

లాస్య రెడ్డికి ఎమ్మెల్యే ఘన సన్మానం

విశాలాంధ్ర-పత్తికొండ: సీబీఎస్ ఈ పదవ తరగతి పరీక్ష ఫలితా లలో రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకు సాధిం చిన పత్తికొండకు చెందిన లాస్య రెడ్డిని శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఘనంగా సన్మానించి ల్యాప్ టాప్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల వెలువడిన సీబీఎస్ఈ ఫలితాలలో పత్తికొండకు చెందిన లాస్య రెడ్డి ఆల్ ఇండియా మూడవ ర్యాంకు, రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. లాస్య రెడ్డి భవిష్యత్తులో మంచి ఉన్నత చదువులు చదివి పత్తికొండ నియోజకవర్గానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు, తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు సాంబ శివారెడ్డి, మండల కన్వీనర్ కడవల సుధాకర్, నాయకులు తిరుపాల్ నాయుడు, చెన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైంది

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ఎస్టీయూ సీనియర్ నాయకునికి ఘనంగా పదవీ విర మణ ఆత్మీయ అభినం దన సభలి నగరంలోని సలాం ఖాన్ ఎస్టీయు భవనం నందు రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న అధ్యక్షతన జరిగింది. శుక్రవారం కోడుమూరు మండలం వర్కూరు గ్రామం నందు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేసి గత నెల30న పదవి విరమణ పొందిన కే నాగేశ్వరరావు ఆత్మీయ సన్మాన అభినందన సభ జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి టీకే జనార్ధన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.వెంకటేశ్వర్లు బి.సుంకన్నలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి మాట్లాడుతూ అన్ని వృత్తుల్లోకెల్లా ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండి పదవి విరమణ చెందడం సంతోషదాయకమన్నారు. నాగేశ్వరావు గారు నీతి, నిజాయితీ, నిబద్ధత, సమయపాలన, అంకితభావంతో ఉపాధ్యాయ వృత్తిని నిర్వర్తిస్తూ ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతూ మరోపక్క రాష్ట్రో పాధ్యాయ సంఘంలో క్రియాశీల నాయకుడిగా ఉంటూ విద్యా ఉపా ధ్యాయ రంగ సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సేవలు వెలకట్టలేని వన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు ఆయన విద్యాభివృద్ధికి, సంఘానికి చేసిన సేవలను కొనియాడారు. తదనంతరం దంపతులిద్దరిని ఘనంగా సన్మానించడం జరిగింది. సన్మాన గ్రహీత నాగేశ్వర రావు మాట్లాడుతూ వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో నిరంతరం సత్సంబంధాలు కలిగి ఉండి విద్యాభివృద్ధికి కృషి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మహమ్మద్ షఫీ, ప్రసన్నరాజు, రామ్మోహన్ రెడ్డి, నాగేంద్రప్ప, సత్యనారాయణ, కుంపటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలబంద, కొబ్బరిలతో వేడి, తేమ ప్రభావం నుండి జుట్టును రక్షించడం

విశాలాంధ్ర- కర్నూలు : వేసవి నెలలు సమీపిస్తున్నట్లు, వేడి తేమ జుట్టుకు ఎక్కువ నష్టం కలిగించ గలవని వేసవి సమయంలో జుట్టులో తేమను నిలుపుకోవడం అత్యంత అవసరమవుతుందని డాక్టర్ శిల్పా వోరా, చీఫ్ ఆర్ అండ్ డీ ఆఫీసర్ అన్నారు. జుట్టు సంరక్షణలో ప్రఖ్యాత నిపుణురాలు, వేడి తేమ యొక్క కఠిన ప్రభావాల నుండి జుట్టును రక్షించుకోవడంలో రెండు కీలక పదార్థాలను ఉపయోగించే పద్ధతిని పంచుకుంటున్నారన్నారు. కలబంద కొబ్బరి ఈ పరిపూర్ణ పరిష్కారం తేమను లాక్ చేయడం ద్వారా మీ జుట్టును తీవ్రంగా పోషించే ప్రత్యేకమైన కలయిక కలబంద అన్నారు. హైడ్రేటింగ్ సూథింగ్ లక్షణాలకు ప్రసిద్ధి చెందిందన్నారు. కలబందతో సమృద్ధిగా ఉన్న ఈ నూనె, జుట్టు నుండి తేమ నష్టాన్ని నివారించ డంలో, జుట్టులో తేమను లాక్ చేయడంలో సహాయ పడుతుందన్నారు. తద్వారా జుట్టు గమనించదగ్గ విధంగా మృదువుగా, సున్నితంగా నిర్వహించడానికి సులభతరం అవుతుందన్నారు. డాక్టర్ వోరా పారాచూట్ అడ్వాన్స్‌డ్ అలోవెరా ఎన్‌రిచ్డ్ కొబ్బరి ఆధారిత హెయిర్ ఆయిల్ మీ జుట్టు సంరక్షణ దినచర్యకు సరైన అదనంగా ఉంటుందన్నారు. దీని తేలికపాటి, అంటుకోని ఫార్ములా పోషణను అందించి, వేసవి అంతా మీ జుట్టును 2 రెట్లు మృదువుగా, సాఫీగా చేస్తుందన్నారు. తేలికపాటి షాంపూతో కడగడానికి ముందు జుట్టు కోసం నూనెను సుమారు 30 నిమిషాలు పని చేయనివ్వండి. వారానికి రెండు నుండి మూడు సార్లు ఇలా చేయడం వల్ల తేమను నిలుపుకోవటానికి, చుండ్రును నియంత్రించడానికి మరియు జుట్టును మృదువుగా, పోషణగా ఉంచడానికి సహాయపడుతుందన్నారు.

నేటి తరం రాజకీయ నాయకులకు మంత్రి ఫరూక్ ఆదర్శనీయులు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : సుదీర్ఘ రాజకీయ అనుభవం, స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌గా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలు కీలక శాఖలకు మంత్రిగా, విభజిత ఆంధ్రప్రదేశ్‌లోను మండలి స్పీకర్‌గా, రెండు పర్యాయాలు మంత్రిగా, ప్రస్తుత రాష్ట్ర న్యాయ, మైనారటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ రాష్ట్రాభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని, మున్సిపల్ కౌన్సిలర్‌గా రాజకీయ ప్రవేశం చేసి, ఎమ్మెల్యేగా విజయం సాధించి నంద్యాల అభివృద్ధికి బాటలు వేసి సాధారణ పౌరుడుగా నంద్యాలలో కలియ తిరుగుతూ అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్ నేటి యువతరం రాజకీయ నాయకులకు ఆదర్శనీయుడని, తమలాంటి యువ ఎంపీలకు మార్గదర్శకుడని, ఫరూక్ 75వ పుట్టిన రోజు వేడుకలలో తాను పాల్గొనడం ఎంతో సంతోషాన్నిచ్చిందని ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. కేక్ తెచ్చి మంత్రి ఫరూక్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి ఫరూక్ భవిష్యత్తులో కూడా ఆనందం, ఆరోగ్యంగా ఉండేలా ఆ దేవుళ్ళు దీవించాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి గురువారం కోరారు. నంద్యాల ప్రశాంతంగా ఉండేందుకు మంత్రి ఫరూక్ కృషి వెలకట్టలేనిదన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశిం చారు. నేడు తేదీన ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం ప్రజా వేదిక, సి.క్యాంప్ రైతు బజార్, స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర పార్క్ భూమి పూజ కార్యక్రమాలకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఏపీ సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజా వేదిక వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకి సంబంధించి ప్రజల నుండి అర్జీలు తీసుకునేందుకుగాను కౌంటర్ ఏర్పాటు చేయడంతో పాటు బ్యానర్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డ్వామా, డీఆర్డీఏ, పీడీలను ఆదేశించారు. స్టేజ్ ఏర్పాట్లు, స్టాల్స్ ఏర్పాట్లు, కాన్వాయ్, వీఐపీ పార్కింగ్ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర పార్క్ ఏర్పాట్లను పరిశీలిస్తూ పరిసర ప్రాంతాల్లో కిందకి ఉన్న కరెంట్ తీగలను 20 అడుగులపైకి లేపాలని కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం సి.క్యాంప్ రైతు బజార్ లో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలిస్తూ షాప్ లు అన్ని మునుపటి లాగే తెరిచి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మార్కెటింగ్ అధికారులను ఆదే శించారు. కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు..

నారా చంద్రబాబు నాయుడు కర్నూలు పట్టణంలో పర్యటించనున్న నేపథ్యంలో బందోబస్తు నిమిత్తం విచ్చేసిన పోలీసులకు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ నంద్యాల చెక్ పోస్టు సమీపంలోని కేంద్రీయ విద్యాలయంకు ఎదురుగా ఉన్న మెగాసిరి ఫంక్షన్ హాల్‌లో పలు సూచనలు, సలహాలు చేసి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కర్నూలు పట్టణంలో ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో, సిఎం కాన్వాయ్, సభ ప్రాంగణం, తదితర ప్రాంతాలలో బందోబస్తు విధులు నిర్వహించే మఫ్టీ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసు బృందాలు, పోలీసు జాగీలాలు, బాంబ్ స్క్వాడ్ బృందాలతో పోలీసు అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏలాంటి సంఘటనలు జరగకుండా భద్రత పరంగా పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకో వాలన్నారు. చేయకూడనవి, చేయవలసిన వాటికి గురించి తెలిపారు. అడిషనల్ ఎస్పీలు నలుగురు, 11 మంది డిఎస్పీలు, 53 మంది సిఐలు, 101 మంది ఎస్సైలు, 383 మంది ఎఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్ళు, 680 మంది కానిస్టేబుళ్ళు, 51 మంది మహిళా పోలీసులు, 416 మంది హోంగార్డులు, 5 సెక్షన్ల ఏ ఆర్ సిబ్బంది, 6 స్పెషల్ పార్టీ బృందాలను బందోబస్తు విధులకు కేటాయించారు. కర్నూలు జిల్లా ఎస్పీతో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్ కర్నూలు రేంజ్ పరిధిలోని అడిషనల్ ఎస్పీలు, డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నూతన వధూవరులు జీవితాంతం సుఖ, సంతోషాలతో వర్ధిల్లాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: తన జన్మదిన సందర్భంగా పెళ్లి చేసుకున్న జంటలందరూ జీవితాంతం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. స్థానిక మౌర్య ఇన్ కాంప్లెక్స్, పరిణయ ఫంక్షన్ హాల్ నందు ఈరోజు వివాహం చేసుకున్న జంటలందరికీ టీజీ కుటుంబ సభ్యులందరూ తమ ఆశీర్వాదాన్ని అందజేశారు. పెళ్లి చేసుకున్న 75 జంటలకు ఒక్కొక్క జంటకు రూ. 80 వేలు చొప్పున డీడీలను, చెక్కులను రాష్ట్ర మంత్రివర్యులు టీజీ భరత్ దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ పెళ్లి చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న వారు ఎలాంటి చెడు వ్యసనాలకు లోను కాకుండా ఆరోగ్యంగా ఉంటూ సంసారాన్ని చక్కదిద్దుకోవా లన్నారు. తన కుమారుడు మంత్రి భరత్‌తో పాటు కుటుంబ సభ్యుల సహకారం ఉన్నందునే తాను సేవా కార్యక్రమాలు నిర్వహించ గలుగుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో టీజీ రాజ్యలక్ష్మి, టీజీ శిల్ప, టీజీ కుటుంబ సభ్యులు సునీల్, కృష్ణజోష్ణ, రవిరాజ్, మౌర్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు కర్నూలులో పర్యటించే అర్హత లేదు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాల పేరుతో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చెయ్యకుండా కాలయాపన చేస్తున్న ఏపీ సీఎం చంద్రబాబుకు కర్నూలు జిల్లా పర్యటించే అర్హత లేదని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గిడ్డమ్మ, నగర కార్యదర్శి వి.భారతిలు అన్నారు. శుక్రవారం సిఆర్ భవన్‌లో ఏపీ మహిళా సమాఖ్య ముఖ్యుల సమావేశం నగర ఉపాధ్యక్షురాలు పావని అధ్యక్షతన జరిగింది. గిడ్డమ్మ, భారతీలు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు, 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళలకి నెలకు 1500 రూపాయలు, తల్లికి వందనం పేరుతో కుటుంబంలో ప్రతి ఒక్క విద్యార్థికి సంవత్సరానికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టి సంవత్సరం గడుస్తున్నా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ఎందుకు నెరవేర్చ లేదని వారు ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు వారిచ్చిన హామీలు అమలు చేయడానికి ఎంత డబ్బు అవసరం వస్తదో 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడుకు తెలియదా అని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటలకు పరిమితం కాకుండా ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీ ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు, తల్లికి వందనం నిధులు కేటాయించి తర్వాతనే జిల్లాలో పర్యటించాలన్నారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య నగర నాయకురాలు మునెమ్మ, రేణుక, రాబియా, సోఫియా, సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.

22న సీపీఐ జిల్లా సమితి సమావేశం : బి.గిడ్డయ్య

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఈ నెల 22న సీపీఐ జిల్లా సమితి సమావేశం సీఆర్ భవన్‌లో జరుగుతుందని ఈ సమావేశానికి సీపీఐ సమితి సభ్యులు సకాలంలో హాజరు కావాలని జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తెలిపారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్యలు హాజరైతారని తెలిపారు. జిల్లా సమితి సభ్యులు, ఆహ్వానితులు, సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

అనేక ఫిర్యాదులందుతున్నాయి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలు వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించడం, ప్రైవేట్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులను అడ్మిషన్ల కొరకు కాంపెయిన్ చేయించడం. నేరుగా ఫిర్యాదు చేస్తే వారికి ఉద్యోగభద్రత ఉండదనే ఉద్దేశ్యంతో ఆయా సంఘాలతో కార్యాలయానికి ఫిర్యాదులు అందుతున్నాయని డీఈవో ఎస్.సామెల్ పాల్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వేసవిలో పాఠశాలలు నిర్వహించినా, అడ్మిషన్ల కొరకు ఉపాధ్యాయులను ఇంటింటికి పంపి ప్రచారం చేయించినా, పాఠశాలలు ప్రచారం నిమిత్తం ఫ్లెక్సీలు అడ్వర్టైజ్మెంట్లు చేసినా, ఆయా పాఠశాలలపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సిలబస్ మాత్రమే అమలు చేయాలని, ఇష్టానుసారంగా పోటీతత్వం పేరుతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తే ఆయా పాఠశాలలపై ఉక్కుపాదం మోపి అనుమతులు రద్దు చేయడం జరుగుతుందన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ఉద్యమ కార్యాచరణ

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు: గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలతో కమిషనర్ గత 30 సమావేశాలు నిర్వహించినప్పటికి, ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేసిన అనేక విషయాలు ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించని కారణంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ద్వారా ఉద్యమ కార్యాచరణ రూపొందించినట్లు ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రధానంగా తెలుగు మీడియంను ఇంగ్లీష్ మీడియంతో పాటు సమాంతరంగా కొనసాగించాలని, ఉన్నత పాఠశాలలో సర్ ప్లస్‌గా గుర్తించబడిన స్కూల్ అసిస్టెంట్లను ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నిష్పత్తి 1:45గా నిర్ణయించి నియమించాలన్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్‌లకు పీఎస్ హెచ్ఎం పోస్టు ఎస్జీటీలకు పదోన్నతులు ద్వారా ఇవ్వాలని, బదిలీలలో పోస్టులను బ్లాక్ చేయరాదన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

విశాలాంధ్ర- వెల్దుర్తి : మండల పరిధిలోని చెరుకులపాడు, కుసనపల్లె, గ్రామాల్లో కిశోర బాలికల వికాసం కార్యక్రమం ఐసీడీఎస్ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. కిశోర వికాస కార్యక్రమాన్ని ఉద్దేశించి డిస్టిక్ ఆఫీసర్ డి.శైలజ కుమార్, ఆర్కేఎస్‌కే జిల్లా అధికారి డాక్టర్ మల్లికార్జున, జిల్లా ఫ్లోరిన్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్, మాట్లాడుతూ బాలికలకు రక్తహీన గురించి క్లుప్తంగా వివరించారు. యుక్త వయసులో వచ్చే మార్పులు, సమస్యల గురించి అవగాహన కల్పించారు. సూపర్వైజర్ సరస్వతి, ఏఎన్ఎం అన్నపూర్ణాదేవి, సుమలత, నిర్మల, అనంతమ్మ, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు

గద్వాల సోమన్న సప్తతి పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర - పెద్దకడబూరు : గద్వాల సోమన్న సప్తతి పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. మండలత పరిధిలోని కంబదహాల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు డా.గద్వాల సోమన్న 70వ పుస్తకం సప్తతి పుస్తకావిష్కరణ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆచార్య డా.దార్ల వెంకటేశ్వరరావు, శతాధిక పుస్తకాల ప్రచురణ కర్త డా.వైరాగ్యం ప్రభాకర్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి, విజిటింగ్ ప్రొఫెసర్ డా కాంచనపల్లి గోవర్ధన్ రాజు శుక్రవారం ఘనంగా జరిగింది. తెలంగాణ బాష సాంస్కృతిక శాఖ, భవానీ సాహిత్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన, శతాధిక కవుల సమ్మేళనంలో కవి గద్వాల సోమన్న పుస్తకావిష్కరణ జరగడం గమనార్హం. అనంతరం ఈ పుస్తకాన్ని కేవీ నాగేశ్వరరావుకు అంకితమిచ్చారు. పుస్తక కృతికర్త గద్వాల సోమన్నను సాహితీ మిత్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

బ్లడ్ బ్యాంక్ ద్వారా ఎందరికో ప్రాణదానం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: నగరంలో ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ద్వారా ఎందరుకో ప్రాణాపాయం నుంచి కోలుకున్నారని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. శుక్రవారం టీజీ వెంకటేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన మెగా బ్లడ్ డొనేషన్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్రూపు రాజకీయాల వల్ల అభివృద్ధి బాగా కుంటుపడేదని అన్నారు. తాను ఎమ్మెల్యేగా మంత్రిగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినప్పటికీ కొంతమంది రాజకీయ నాయకులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తేవడం వల్ల పనులు సక్రమంగా జరిగేవి కావన్నారు. ఎంతోమంది రోగులకు ఉపయోగపడే బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు కొరకు స్థల సేకరణకు అడ్డుకున్నారని, ఈరోజు అదే బెడ్ బ్యాంకు వల్ల సంవత్సరానికి పదివేల యూనిట్ల ఇవ్వగలుగుతున్నామని అన్నారు. దీని ద్వారా ఎంతోమంది రోగుల ప్రాణాపాయం తప్పుతుందన్నారు. పంచలింగాల వద్ద రైల్వే ప్రాజెక్టును అప్పటి కేంద్ర రైల్వే సహాయ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి సహకారంతో తీసుకురావడం జరిగిందని దానిని కూడా అడ్డుకునేందుకు ప్రయత్నించారని అన్నారు. అది ఇప్పుడు త్వరలోనే ప్రారంభం కానుందని టీజీ తెలిపారు. దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి, కేజీ గోవింద్ రెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, శ్రీనివాస్, ఎస్కే మహేష్ తదితరులు పాల్గొన్నారు.